RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక


వరంగల్ | సంచిక 277 | సంపుటి 4 | బుధవారం | 08-07-2026 | పేజీలు 4 | వెల 3/-

## ముంబైని ముంచెత్తిన వాన

ముంబై, ప్రభాత గమనం :



దేశ ఆర్థిక రాజధాని ముంబైతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ముంబైలోని అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై నీరు నిలవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రైలు సేవలు చాలా వరకు నిలిచిపోయాయి. కొన్ని విమాన సర్వీసులు రద్దు కాగా, వందలాది విమానాలు ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గత 24 గంటల వ్యవధిలో మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో 600 మి.మీ. వర్షం కురిసింది. దీంతో ముంబై–పుణె మార్గంలోని కర్జత్–లోనావాలా ఘాట్ రోడ్డులో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి.




2

# కేసముద్రంలో రాజకీయ హీట్!

## తెరవెనుక వేగంగా మారుతున్న సమీకరణాలు..

- పార్టీ మార్పులపై జోరుగా ఊహాగానాలు
- అసంతృప్తి నేతల కదలికలతో వేడెక్కిన రాజకీయాలు..
- శ్రావణంలోనే కీలక నిర్ణయాలు?..
- స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్‌గా వ్యూహాలు

స్థానిక సంస్థల ఎన్నికల వేళ కేసముద్రం రాజకీయాలు అనూహ్య మలుపు తిరుగుతున్నాయనే ప్రచారం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. నిన్నటి వరకు ప్రశాంతంగా కనిపించిన రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కగా, వివిధ పార్టీలకు చెందిన పలువురు కీలక నాయకులు తమ రాజకీయ భవిష్యత్తుపై పునరాలోచన చేస్తున్నారనే గుసగుసలు నియోజకవర్గవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. తమ పార్టీల్లో ప్రాధాన్యం తగ్గిందనే అసంతృప్తితో కొందరు సీనియర్, ద్వితీయ శ్రేణి నాయకులు కొత్త రాజకీయ ఆశ్రయం కోసం ప్రయత్నిస్తున్నారనే ప్రచారం సాగుతుండగా, మరోవైపు ప్రధాన రాజకీయ పార్టీలు ప్రభావశీల నాయకులను తమవైపు తిప్పుకునేందుకు తెరవెనుక వ్యూహాత్మక చర్చలు జరుపుతున్నాయనే సమాచారం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. రచ్చబండల నుంచి సామాజిక మాధ్యమాల వరకు ప్రస్తుతం కేసముద్రం రాజకీయాల గురించే చర్చ నడుస్తోంది. "ఎవరు పార్టీ మారబోతున్నారు?", "ఏ పార్టీకి ఎంత బలం పెరగబోతోంది?", "ఈ మార్పు స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై ఎంత ప్రభావం చూపనుంది?" అనే ప్రశ్నలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఎవరూ బహిరంగంగా స్పందించకపోయినా, తెరవెనుక జరుగుతున్న రాజకీయ సంప్రదింపులు, రాయబారాలు, వ్యూహాలు రాబోయే రోజుల్లో కేసముద్రం రాజకీయ చిత్రాన్ని పూర్తిగా మార్చే అవకాశముందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. శ్రావణ మాసం నాటికి ఈ రాజకీయ కదలికలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అయితే, ఇప్పటివరకు ఈ ప్రచారాలపై సంబంధిత నాయకులు లేదా పార్టీలు అధికారికంగా స్పందించక పోవడంతో కేసముద్రం రాజకీయాల్లో ఉత్కంఠ మరింత పెరిగింది.

— హైదరాబాద్, ప్రభాతగమనం






# కాంగ్రెస్‌లో కలకలం..!

- కడియం శ్రీహరి వ్యవహారశైలిపై సీఎం రేవంత్‌కు మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు
- 'ఒకరి శాఖలో మరొకరికి ఏం పని?'.. అధికార పరిధి దాటుతున్నారని ఆరోపణలు
- శాఖ మంత్రిని పక్కనపెట్టి అధికారులతో సమీక్షలపై అభ్యంతరం..
- పార్టీ క్రమశిక్షణ కమిటీతో విచారణ కోరిన మంత్రి

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో:

తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరందుకుంది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యవహారశైలిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సుదీర్ఘ లేఖ రాయడం పార్టీలో కలకలం రేపింది. తన శాఖకు సంబంధించిన అంశాల్లో తనకు సమాచారం ఇవ్వకుండా అధికారులతో సమీక్షలు నిర్వహించడం ప్రభుత్వ పరిపాలనా విధానాలకు, మంత్రివర్గ బాధ్యతలకు విరుద్ధమని మంత్రి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అవసరమైతే పార్టీ క్రమశిక్షణ కమిటీ ద్వారా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిసింది. మంత్రి తన లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. దేవాదాయ, ధర్మాదాయ శాఖకు సంబంధించిన విధాన నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాలు, నిధుల కేటాయింపులు, దేవాలయాల నిర్వహణ, మాస్టర్ ప్లాన్లు, భూముల పరిరక్షణ వంటి అంశాలు పూర్తిగా సంబంధిత శాఖా మంత్రి పరిధిలోకి వస్తాయి. అయినప్పటికీ శాఖా మంత్రికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ డైరెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులతో అధికారిక సమీక్ష నిర్వహించడం పరిపాలనా పరంగా అభ్యంతరకరమని ఆమె పేర్కొన్నారు.

### 'రూల్స్ ఆఫ్ బిజినెస్' ఉల్లంఘన

ప్రభుత్వంలో ప్రతి శాఖకు సంబంధించిన నిర్ణయాలు, అధికారాల వినియోగం, పరిపాలనా బాధ్యతలు సంబంధిత శాఖా మంత్రి ఆధ్వర్యంలోనే జరగాలని ప్రభుత్వ 'రూల్స్ ఆఫ్ బిజినెస్' స్పష్టం చేస్తుందని మంత్రి లేఖలో పేర్కొన్నారు. అలాంటి వ్యవస్థను పక్కనపెట్టి ఒక ఎమ్మెల్యే అధికారులతో సమీక్షలు నిర్వహించడం ప్రభుత్వ పరిపాలనా స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. "ప్రతి శాఖకు ఒక మంత్రి ఉన్నప్పుడు, శాఖా మంత్రిని పక్కనపెట్టి అధికారులతో సమావేశాలు నిర్వహించడం అధికార పరిమితులను అతిక్రమించడమే. ఒకరి శాఖలో మరొకరు జోక్యం చేసుకోవడం ప్రభుత్వ వ్యవస్థలో సరైన సంప్రదాయం కాదు" అని మంత్రి లేఖలో స్పష్టం చేసినట్లు సమాచారం.

### 'ఇది కొత్త విషయం కాదు'.. కడియంపై తీవ్ర వ్యాఖ్యలు

మంత్రి తన లేఖలో కడియం శ్రీహరి వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అధికార పరిధికి సంబంధం లేని అంశాల్లో జోక్యం చేసుకోవడం ఆయనకు కొత్త కాదని, సమిష్టి బాధ్యతను విస్మరించి వ్యక్తిగత నిర్ణయాల దిశగా వ్యవహరించడం సరికాదని ఆమె పేర్కొన్నట్లు సమాచారం. శాఖా మంత్రిగా ఉన్న తనకు కనీస సమాచారం ఇవ్వకుండా అధికారులతో సమావేశాలు నిర్వహించడం వ్యక్తిగతంగా తనను అవమానించడమే కాకుండా, మంత్రివర్గ వ్యవస్థను కూడా అవమానించినట్లేనని మంత్రి ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇటువంటి చర్యలు కొనసాగితే ప్రభుత్వం, పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుందని ఆమె హెచ్చరించినట్లు సమాచారం.

### అధికార యంత్రాంగంలో గందరగోళం..!

ఇలాంటి చర్యల వల్ల అధికారులు ఎవరి ఆదేశాలను అమలు చేయాలనే విషయంలో అయోమయం ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పరిపాలనా సమన్వయానికి భంగం కలిగే అవకాశం ఉందని, ఇది ప్రజాపాలనపై ప్రతికూల ప్రభావం చూపుతుందని లేఖలో వివరించారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపించి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని, అవసరమైతే పార్టీ క్రమశిక్షణ కమిటీ ద్వారా విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరినట్లు సమాచారం. మంత్రి ఫిర్యాదుతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఈ అంశంపై ముఖ్యమంత్రి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? పార్టీ క్రమశిక్షణ కమిటీ స్పందిస్తుందా? అనే అంశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



2

## విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం అవసరం

- భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ ను ప్రారంభించిన సీపీ ఎన్. శ్వేత
- సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ దర్యాప్తులో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని సూచన
- మూడు రోజులపాటు వరంగల్ లో పోలీసు నైపుణ్యాల ప్రదర్శన

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో:

పోలీసు అధికారులు, సిబ్బంది విధుల్లో అత్యుత్తమంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవడం అత్యంత అవసరమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. మంగళవారం మామునూర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్న భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌ను ఆమె ప్రారంభించారు. భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది ఈ డ్యూటీ మీట్‌లో పాల్గొంటున్నారు.

## కేరళలో వర్ష బీభత్సం

- వయనాడ్ లో కొండచరియలు విరిగి ముగ్గురి మృతి
- శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు అనుమానం
- సహాయక చర్యలకు ప్రతికూల వాతావరణం అడ్డంకి

తిరువనంతపురం, ప్రభాత గమనం :

కేరళలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు మరోసారి వయనాడ్ జిల్లాలో విషాదాన్ని మిగిల్చాయి. వయనాడ్ జిల్లా మెప్పాడి సమీపంలోని కల్లాడి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సొరంగ మార్గం వద్ద మంగళవారం భారీ కొండచరియలు విరిగిపడటంతో ముగ్గురు కార్మికులు మృతిచెందారు. మరో పలువురు మట్టి, రాళ్ల కింద చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్), విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. మట్టి దిబ్బల కింద చిక్కుకున్న ఆరుగురిని సురక్షితంగా బయటకు తీసి ఆసుపత్రికి తరలించగా, మరికొంతమంది కోసం గాలింపు కొనసాగుతోంది. అయితే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, బురదతో కూడిన పరిస్థితులు సహాయక చర్యలకు తీవ్ర ఆటంకంగా మారాయి.



సోమవారం అర్ధరాత్రి నుంచి వయనాడ్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో 24 గంటల్లో సుమారు 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో కొండపై నుంచి భారీగా మట్టి, బండరాళ్లు జారిపడి సొరంగ నిర్మాణ ప్రాంతంతో పాటు కార్మికుల వసతి గృహాలను కప్పివేశాయి. ఈ ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి అత్యవసరంగా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

# గంగారం, కొత్తగూడ మండలాల్లో సెల్ టవర్స్ ఏర్పాటుకు చర్యలు

- ప్రభుత్వ పథకాల అమలులో ఆన్ లైన్ సేవలు అత్యవసరం
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్...

**మహబూబాబాద్, జులై 7(ప్రభాత గమనం):**

జిల్లాలోని గంగారం, కొత్తగూడ మండలాలలో మొబైల్ సెల్ టవర్స్ ఏర్పాటుచేసి సిగ్నల్ వచ్చే విధంగా తక్షణమే సంబంధిత నెట్వర్క్ మొబైల్ ఇన్చార్జిలు చర్యలు తీసుకోవాలని అందుకు కావలసిన ఏర్పాట్లను రెవెన్యూ జిల్లా యంత్రాంగం ఫారెస్ట్ సిద్ధం చేస్తుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో క్షేత్రస్థాయిలో కచ్చితంగా ఆన్లైన్ సేవలు అవసరమన్నారు. యూరియా ఆన్లైన్ బుకింగ్, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియలో, ఎస్ఐఆర్ , ఐసిడిఎస్, పంచాయతీరాజ్, అన్నీ విభాగములకు సంబంధించి ఆన్లైన్లో అప్లోడ్ చేయడం కచ్చితంగా అవసరమని, ఆయా మండలాలలో నెట్వర్కుల సమస్యల వలన అర్హులకు పథకాలను అందించడంలో జాప్యం జరుగుతుందన్నారు.ఇట్టి విషయంలో గత నెలలో సంబంధిత ఎయిర్టెల్, బిఎస్ఎన్ఎల్, వోడాఫోన్, జియో, ఐడియా, తదితర సంస్థలతో సంప్రదింపులు జరిపి భూ సేకరణ, చేసి సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు. అనుమతులకు సంబంధించి ఫారెస్ట్ ల్యాండ్, అసైన్డ్, పట్టా భూముల అనుమతులపై తక్షణమే అప్పగింతకు సిద్ధంగా ఉన్నారని, సంబంధిత నెట్వర్క్ యజమాన్యాలు ముందుకు వచ్చి ప్రభుత్వ పథకాల అమలులో సహకరించగలరని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, గంగారం కొత్తగూడ మండలాల తహసిల్దార్లు బాలకిషన్, రాజు, కలెక్టరేట్ సూపర్డెంట్లు మదన్ గోపాల్, దామోదర్ పాల్గొన్నారు.



# రూ.64.24 లక్షల విలువైన డ్రై గంజాయి దహనం

- కోర్టు అనుమతితో 128.496 కిలోల డ్రగ్స్ ను ధ్వంసం చేసిన పోలీసులు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో:**

మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా మహబూబాబాద్ జిల్లా పోలీసులు మరో కీలక చర్య చేపట్టారు. ఈగల్ ఆదేశాల మేరకు, జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన ఎన్డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.64.24 లక్షల విలువైన 128.496 కిలోల డ్రై గంజాయిని కోర్టు అనుమతితో పూర్తిగా దగ్ధం చేశారు. మహబూబాబాద్ జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ సమావేశం అనంతరం న్యాయస్థానం అనుమతి మేరకు ఈ మాదక ద్రవ్యాలను వరంగల్లోని కాకతీయ మెడికల్ వేస్ట్ డిస్పోజల్ యూనిట్లో ప్రత్యేక యంత్రాల ద్వారా నిబంధనలకు అనుగుణంగా పూర్తిగా నాశనం చేశారు. ఈ కార్యక్రమాన్ని మహబూబాబాద్ డీఎస్పీ గండ్రాతి మోహన్, సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఎస్పీ గండ్రాతి మోహన్ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశాల మేరకు జిల్లాలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు, వినియోగంపై పోలీసు శాఖ రాజీ లేకుండా చర్యలు కొనసాగిస్తోందని తెలిపారు.

# విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యాం అవసరం

- భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ ను ప్రారంభించిన సీపీ ఎన్.శ్వేత
- సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ దర్యాప్తులో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని సూచన
- మూడు రోజులపాటు వరంగల్ లో పోలీసు నైపుణ్యాల ప్రదర్శన


**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో:**



పోలీసు అధికారులు, సిబ్బంది విధుల్లో అత్యుత్తమంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవడం అత్యంత అవసరమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. మంగళవారం మామునూర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్లో మూడు రోజులపాటు నిర్వహించనున్న భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ను ఆమె ప్రారంభించారు. భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది ఈ డ్యూటీ మీట్లో పాల్గొంటున్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ప్రింట్ లిఫ్టింగ్, ప్యాకింగ్ అండ్ హ్యాండ్లింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో తమ వృత్తి నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ప్రతి విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్కు ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్కు కూడా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆతిథ్యం ఇవ్వనున్న విషయం విశేషం. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ, పోలీస్ డ్యూటీ మీట్లు సిబ్బందిలో సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ దర్యాప్తు, ఆధారాల సేకరణలో నైపుణ్యాలను పెంపొందించే ఉత్తమ వేదికలని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించడం ద్వారా నేరాలను వేగంగా ఛేదించడంతో పాటు ప్రజలకు మరింత నాణ్యమైన పోలీసు సేవలు అందించవచ్చని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు బాలస్వామి, శ్రీనివాస్, జోనల్ పరిధిలోని ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కేసముద్రంలో రాజకీయ హీట్!

- తెరవెనుక వేగంగా మారుతున్న సమీకరణాలు..
- పార్టీ మార్పులపై జోరుగా ఊహాగానాలు
- అసంతృప్తి నేతల కదలికలతో వేడెక్కిన రాజకీయాలు
- శ్రావణంలోనే కీలక నిర్ణయాలు?..
- స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్ గా వ్యూహాలు



**హైదరాబాద్, ప్రభాతగమనం:**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కేసముద్రం రాజకీయాలు అనూహ్య మలుపు తిరుగుతున్నాయనే ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నిన్నటి వరకు ప్రశాంతంగా కనిపించిన రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. వివిధ పార్టీలకు చెందిన కీలక నాయకులు పార్టీ మార్పుపై అంతర్గతంగా మంతనాలు జరుపుతున్నారనే ప్రచారం మండలవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తోంది. రాజకీయంగా కీలకమైన కేసముద్రంలో తెరవెనుక జరుగుతున్న ఈ కదలికలు రాబోయే ఎన్నికల సమీకరణాలను పూర్తిగా మార్చే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఇప్పటివరకు ఏ నాయకుడు గానీ, ఏ రాజకీయ పార్టీ గానీ ఈ ప్రచారాన్ని అధికారికంగా ధృవీకరించలేదు.

**ప్రాధాన్యం తగ్గిందనే అసంతృప్తి..?**

విశ్వసనీయ రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, కొందరు సీనియర్ నాయకులు, ద్వితీయ శ్రేణి నేతలు తమ పార్టీల్లో తగిన గుర్తింపు, ప్రాధాన్యం లభించడం లేదనే అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. నిర్ణయాల్లో తమకు స్థానం లేకపోవడం, స్థానిక రాజకీయాల్లో కొత్త నాయకత్వానికి ప్రాధాన్యం పెరగడం వంటి పరిణామాలు కొందరిలో అసంతృప్తికి కారణమైనట్లు చర్చ జరుగుతోంది.

**'ఆపరేషన్ ఆకర్ష్'కు తెరలేపిన ప్రత్యర్థి పార్టీలు..?**

ఈ పరిస్థితిని అవకాశంగా మలుచుకునేందుకు ఇతర ప్రధాన రాజకీయ పార్టీలు రంగంలోకి దిగినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రభావం ఉన్న నాయకులను తమవైపు తిప్పుకునేందుకు రహస్య చర్చలు, రాయబారాలు జరుగుతున్నాయనే ప్రచారం బలంగా వినిపిస్తోంది. కేవలం రాజకీయ నాయకులే కాకుండా, స్థానికంగా ఆర్థిక, సామాజిక ప్రభావం కలిగిన వ్యక్తులతోనూ సంప్రదింపులు కొనసాగుతున్నాయనే సమాచారం రాజకీయ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది.

**గ్రామాల్లో రాజకీయాలే హాట్ టాపిక్**

కేసముద్రం మండలంలోని గ్రామాల్లో ప్రస్తుతం రాజకీయాలే ప్రధాన చర్చగా మారాయి. చాయ్ దుకాణాలు, రచ్చబండలు, సామాజిక మాధ్యమాల వేదికగా "ఎవరు పార్టీ మారబోతున్నారు?", "ఎవరి వెంట ఎంతమంది కార్యకర్తలు వెళ్లనున్నారు?", "ఈ మార్పు ఎవరికి లాభం.. ఎవరికి నష్టం?" అనే అంశాలపై చర్చలు సాగుతున్నాయి. సోషల్ మీడియా వేదికల్లో అనుకూల, ప్రతికూల పోస్టులు, వ్యాఖ్యలు కూడా పెరుగుతున్నాయి. దీంతో రాజకీయ వాతావరణం రోజురోజుకూ మరింత వేడెక్కుతోంది.

**స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యమా..?**

రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రధాన పార్టీలు తమ బలాబలాలను పునర్వ్యవస్థీకరించే పనిలో ఉన్నట్లు కనిపిస్తోంది. గెలుపు అవకాశాలు ఉన్న నాయకులను ముందుగానే తమవైపు తిప్పుకోవాలనే వ్యూహంతో పార్టీలు అడుగులు వేస్తున్నాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేసముద్రం రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న ప్రతి పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

**శ్రావణంలో స్పష్టత వచ్చే అవకాశమా..?**

ప్రస్తుతం అన్ని చర్చలు గోప్యంగానే కొనసాగుతున్నప్పటికీ, శ్రావణ మాసంలో పార్టీ మార్పులపై స్పష్టత వచ్చే అవకాశముందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కొందరు నాయకులు శుభ ముహూర్తాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు ప్రకటించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

**మారనున్న రాజకీయ సమీకరణాలు?**

ఒకవేళ ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం నిజమైతే, కేసముద్రం రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికలపై కూడా దీని ప్రభావం ఉండొచ్చని విశ్లేషిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఈ ప్రచారాలపై సంబంధిత నాయకులు లేదా రాజకీయ పార్టీలు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో కేసముద్రం రాజకీయాల్లో జరుగుతున్న కదలికలపై ఉత్కంఠ కొనసాగుతోంది.

# హసన్పర్తిలో పోలీసుల తనిఖీలు

- గుట్కా, మాదకద్రవ్యాల విక్రయిస్తే కఠిన చర్యలు :సీఐ ఆకునూరి మహేందర్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




హసన్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత గుట్కాలు, పొగాకు ఉత్పత్తులు, మాదకద్రవ్యాల విక్రయాలను అరికట్టే లక్ష్యంతో మంగళవారం హసన్పర్తి సెంటర్లోని పలు పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హసన్పర్తి పోలీస్ స్టేషన్ సీఐ ఎ. మహేందర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో షాపుల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కాలు, ఇతర మత్తు పదార్థాలు నిల్వ ఉంచారా, విక్రయిస్తున్నారా అనే అంశాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ ఎ. మహేందర్ మాట్లాడుతూ, యువత భవిష్యత్తును నాశనం చేసే గుట్కాలు, నికోటిన్ కలిగిన పొగాకు ఉత్పత్తులు, ఎలాంటి మాదకద్రవ్యాల విక్రయాన్నీ సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత పదార్థాలను నిల్వ ఉంచినా, రహస్యంగా విక్రయించినా సంబంధిత షాపు యజమానులపై కేసులు నమోదు చేసి చట్టంలోని కఠినమైన సెక్షన్ల కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా పాఠశాలలు, విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో గుట్కాలు లేదా ఇతర మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో హసన్పర్తి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# సజావుగా 'సర్' ప్రక్రియ

- మహబూబాబాద్ జిల్లాలో 99.62 శాతం ఎన్యూమరేషన్ ఫామ్స్ పంపిణీ పూర్తి...
- ప్రతి ఒక్కరూ సర్ కార్యక్రమంలో పాల్గొని వివరాలు నమోదు చేసుకోవాలి
- అందిన ఎన్యూమరేషన్ ఫామ్స్ డిజిటలైజేషన్ చేయుటకు సిద్ధం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్, జులై 7(ప్రభాత గమనం):**




జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 99.62 శాతం పూర్తయిందని అందిన ఫామ్స్ డిజిటలైజేషన్ చేయుటకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో బూతు లెవల్ అధికారులు, సూపర్వైజర్లు, ఎన్నికల సిబ్బంది పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతూ ఎస్ ఐ ఆర్ సవరణ కార్యక్రమంలో నిమగ్నమయ్యారని ఆమె అన్నారు. ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేస్తామని, అన్ని బీఎల్ఓలు ఫారం-6 డిక్లరేషన్తో ఇంటింటికీ వెళ్తున్నారని, ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నానమమ్మారు. ఈ "ఎస్ ఐ ఆర్" సవరణ కార్యక్రమంలో డోర్నకల్ 267, మహబూబాబాద్ 288, మొత్తం 555 బిఎల్ఓ లు, సూపర్వైజర్స్ 56, ఏఈఆర్ఓ లు 12 మంది, ఈ ఆర్ ఓ లు 2 మంది, జిల్లా వ్యాప్తంగా వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేయుటకు చర్యలు తీసుకున్నామని, సర్వే కు వెళ్లే ముందు సిబ్బంది ఐడి కార్డు, క్యాప్, మెటీరియల్ తీసుకుని సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఆన్లైన్ లో ఎన్యూమరేషన్ ఫాం ఫిల్ చేయుటకు మరియు 2002 జాబితాలో పేరు కొరకు voters.eci.gov.in ని సంప్రదహించలని లేదా ఈసిఐఎన్టి యాప్ డౌన్లోడ్ చేసుకొని చూసుకోవచ్చు అని తెలిపారు. ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియ కార్యక్రమంలో ఎలా సందేశాలు వచ్చిన టోల్ ఫ్రీ నెంబర్ 1950 సంప్రదించాలనీ కలెక్టర్ కోరారు.జిల్లాలో 555 పోలింగ్ బూతులకు గాను 4 లక్షల 84 వేల 935 మంది ఎలక్ట్రోరల్స్ ఉండగా ఇప్పటివరకు 4 లక్షల, 83 వేల 099 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయడం పూర్తయిందని, అందులో 47వేల 535 ఫారాలను పరిశీలించడం జరిగిందని, అందులో 75 మంది ఓటర్లు చనిపోయినట్లుగా గుర్తించగా, 19 మంది ఓటరులు షిఫ్ట్ అయ్యారు, ఎస్ఐఆర్, మ్యాపింగ్లో సందేహాలు ఉంటే ప్రత్యేక హెల్ప్ డే స్కూలు ఏర్పాటు చేసి, ఓటర్లులో చైతన్యం విస్తృత ప్రచారం కల్పించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. అత్యంత ప్రాధాన్యత అంశంగా ఈ ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తీసుకొని ముందుకు సాగుతున్నారని ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం పర్యవేక్షిస్తూ తగు సూచనలు సలహాలు జారీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి వారంలో ఒకరోజు అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తూ వారి సలహాలు సూచనలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నామని, ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో స్థానిక శాసనమండలి సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక బృందాల సభ్యులు, ప్రతి ఒక్కరూ ఉత్సాహంతో పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవడం జరుగుతుందని. ప్రతి మండల పరిధి డివిజన్ల వారీగా బిఎల్వోలు సూపర్వైజర్లు తదితరులతో సమావేశాలు నిర్వహించి డిజిటలైజేషన్ గురించి అవగాహన కల్పిస్తూ ఎలా చేయాలి అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

# సైబర్ బాధితులకు మానవతా దృక్పథంతో సేవలు అందించాలి

- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ
- సైబర్ నేరాల నియంత్రణలో అప్రమత్తంగా ఉండాలి
- ప్రజల్లో అవగాహన పెంచాలని సూచన

**సూర్యపేట, జులై 7(ప్రభాత గమనం):**

సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న సైబర్ వారియర్ పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ అధ్యక్షత వహించి సైబర్ నేరాల నియంత్రణలో పోలీసు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సైబర్ మోసాలకు గురై పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల మానవతా దృక్పథంతో స్పందించి వారికి త్వరిత గతిన న్యాయం జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ఆర్థికంగా నష్టపోయిన బాధితుల సొమ్ము వీలైనంత త్వరగా తిరిగి అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా సైబర్ భద్రత విభాగంతో సమన్వయం చేసుకుంటూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరస్థులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. అలాగే ప్రజల్లో సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించడం ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతా




వివరాలు ఓటీపీలు వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దని మొబైల్ సందేశాలు ఈమెయిళ్లలో వచ్చే అనుమానాస్పద లింకులను తెరవవద్దని ఉచిత బహుమతులు తక్కువ ధరలకు వస్తువులు ఇస్తామని చెప్పే ప్రకటనలను నమ్మవద్దని అధికారుల పేర్లతో నకిలీ సోషల్ మీడియా ఖాతాల ద్వారా డబ్బులు అడిగే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే సమీప పోలీసు స్టేషన్ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి సైబర్ భద్రత విభాగం ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ సాంకేతిక బృందం అధికారి రాజశేఖర్ సైబర్ వారియర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# టీచర్లు బడుల్లో భోజనం చేస్తేనే వంట నాణ్యాత మెరుగుపడుతుంది

- సీఎం రేవంత్ రెడ్డి..
- పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకంపై సీఎం కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ జులై 7(ప్రభాత గమనం):**

పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా బ్రేక్ఫాస్ట్, మధ్యాహ్న భోజనం చేస్తేనే వంట నాణ్యత మెరుగుపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్లోని నాచారంలో బాలామృతం నూతన ప్లాంట్ ప్రారంభోత్సవం అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయులు కూడా భోజనం చేస్తే ఆహారం నాణ్యతపై మరింత పర్యవేక్షణ ఉంటుందని, విద్యార్థులకు మెరుగైన ఆహారం అందుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఇటీవల ఉపాధ్యాయులకు బ్రేక్ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అవసరం లేదని పీఆర్టీయూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, సీఎం వ్యాఖ్యలను బట్టి ఈ పథకాన్ని ప్రభుత్వం కొనసాగించే అవకాశాలు ఉన్నట్లు స్పష్టమవుతోంది.



# సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందించాలి

- జిల్లా అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి
- దిశ కమిటీ చైర్మన్, పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాం నాయక్
- పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి : విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్




**మహబూబాబాద్ జులై 7(ప్రభాత గమనం):**

మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో దిశ కమిటీ సమావేశం మహబూబాబాద్ పార్లమెంటు సభ్యుడు పోరిక బలరామ్ నాయక్, అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అదనపు కలెక్టర్లు రెవెన్యూ కె.అనిల్ కుమార్,(ఇంచార్జ్) స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, దిశ కమిటీ సభ్యులు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిశ కమిటీ చైర్మన్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్...మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలను అందించడం కోసం అధికారులు పనిచేయాలని సూచించారు. అనంతరం వ్యవసాయం, హౌసింగ్, వైద్య ఆరోగ్య, సంక్షేమం, స్టేట్, నేషనల్ హైవే, డీఆర్డిఏ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, సివిల్ సప్లై, ఎంపీ, డి.ఎం.ఎఫ్.టి ల్యాండ్స్ మార్కెటింగ్, విద్యా శాఖ, పశు వైద్య, పశుసంవర్ధక, సెరికల్చర్, హార్టికల్చర్, ఉపాధి కల్పనా, పంచాయతీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బిసి, సంక్షేమ శాఖలు, మైన్స్ అండ్ జియోలజీ, కార్మిక, సర్వే ల్యాండ్ రికార్డ్స్, పరిశ్రమలు, ప్రీ – మెట్రిక్ పోస్ట్ మెట్రిక్, ఎం. సి. ఎం, ఉపకార వేతనాలు, యూత్,స్పోర్ట్స్, వాతావరణ, బిఎస్ఎన్ఎల్, మత్స్య శాఖ, రెడ్కో, పోస్టల్, బ్యాంక్స్, పురపాలక సంఘాలు (మున్సిపల్) మహబూబాబాద్, మరిపెడ, డోర్నకల్, తొర్రూరు, కేసముద్రం, రోడ్లు, భవనాలు రహదారి, గ్రంథాలయం, జిల్లా ప్రధాన హాస్పిటల్, కామన్ సర్వీస్ సెంటర్, తదితర (90) అంశాలపై సుదీర్ఘ సమయం సమావేశం జరిగింది.

దిశా కమిటీ చైర్మన్ పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ... మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే నిర్వహించబడుతున్న అంతర్గత పట్టణ అభివృద్ధి పనులను వేగం పెంచాలని సూచించారు.యూరియా కొరత లేకుండా, బుకింగ్ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ప్రతీ కేంద్రం వద్ద ఒక వాలెంటీర్ ను నియామకం చేస్తున్నామని, గడ్డి మందు వాడకం వలన వ్యాధులు వస్తున్నాయని, అలాగే (ప్యారకర్పస్ గడ్డి మందు) ను బ్యాన్ చేయడం జరిగిందన్నారు, సాయిల్ హెల్త్ కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని, రైతులకు పంట మార్పిడి విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ, డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని సౌకర్యాలు వసతులు కల్పించాలని, జిల్లాలో హెచ్ఐవి, టిబి, షుగర్, తలసేమియా తదితర వ్యాధుల నివారణ చర్యలు తీసుకోవాలని వైద్యలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లాలో అర్హులైన అధికారులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందించాలని, మంజూరు అయిన ఇండ్ల విషయంలో అధికారులు వేగంగా పూర్తి చేయాలి అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో చదువుతున్న పిల్లల పౌష్టికాహారం అందించాలని, పాత, నూతన భవనాలు స్థితిగతులను పరిశీలించాలని, పక్కా ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలన్నారు.రైల్వే లైన్లో వెంబడి అవసరం ఉన్నచోట అండర్ పాసులు, ఆర్వోబిలు నిర్మాణం కోసం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తెలియపరచాలన్నారు. కేంద్రం నుండి వచ్చే నిధుల సమీకరణ కోసం ముఖ్యమంత్రి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని ముందుకు సాగుతుందని జిల్లా అభివృద్ధి కోసం అధికారులు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు.

ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ వాటిపై అవగాహన కల్పించడం కోసం అధికారులు నిబద్దతతో పనిచేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కొత్త చట్టం ప్రకారం జిల్లాలో షెడ్యూల్ ప్రకారం పథకాలను అమలు చేయాలని, ఇరిగేషన్ పరిధిలో ఉన్నటువంటి పెండింగ్ పనులను మైనర్ రిపేరు పనులను త్వరగా పూర్తి చేయాలని వర్షాకాలం నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.విద్యాశాఖ సంబంధించి పిల్లలకు నాణ్యమైన రుచికరమైన డైట్ మెనూ అమలు చేయాలని గతంలో మాదిరిగానే జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని, మైనింగ్ విభాగానికి సంబంధించి నిబంధనలు ప్రకారం నడుచుకోవాలని సూచించారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలు ప్రైమినిస్టర్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీం, పీఎం ఎఫ్ఎంఈ, డిస్టిక్ ఇండస్ట్రియల్ సెంటర్ స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ పథకాన్ని అమలు చేయడం కోసం క్షేత్రస్థాయిలో ప్రణాళికల రూపొందించాలని అన్నారు. విద్యుత్ శాఖ ద్వారా జిల్లాలో పాత వంగిపోయిన రైట్ విద్యుత్ లైన్లను సరిచేయాలని, తగినంత సిబ్బందిని సమకూర్చుకోవాలన్నారు.రోడ్లు భవనాల శాఖ, పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేయాలని ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి తగు చర్యలు నిమిత్తం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నేషనల్ హైవే, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి ల ద్వారా జిల్లాలోని కొనసాగుతున్న రోడ్లు పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్...మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుకు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో నిబద్ధతతో పనిచేయడం జరుగుతుందని, యూరియా ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, నానో యూరియా వాడకం పై స్వయం సహాయక బృందాల చేత డ్రోన్ ఏర్పాట్లు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పంట మార్పిడి విధానం, పై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని, క్లస్టర్ల వారీగా విభజించి ఆయిల్ ఫామ్, ఇతర వాణిజ్య పంటలు, పండ్ల పంటలు, రైతులకు అధిక లాభాలు చేకూరే పంటల వైపు మొగ్గు చూపే విధంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు సూచనలు జారీ చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సభ్యులు అడిగిన ప్రశ్నలకు లిఖితపూర్వకంగా సమగ్ర నివేదిక తమకు సమర్పించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు, అన్ని ఎజెండా అంశాలకు సంబంధించి మినిట్స్ ప్రకారం క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకొని ముందుకు సాగుతామని పార్లమెంటు సభ్యులు, ప్రభుత్వ విప్ లకు వివరించారు. ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, దిశ కమిటీ సభ్యులు లాలు నాయక్, కిషన్ రాజపుత్, బాబురావు,ఎం.గీతరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్లు మహబూబాబాద్ గుగులోతు జ్యోతి, డోర్నకల్ రాజకుమారి, కేసముద్రం బానోతు సునీత, మరిపెడ ప్రగతీ రెడ్డి, అన్ని విభాగాల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# జీవో 25 ను రద్దు చేయాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్

**కేసముద్రం, జులై 7(ప్రభాత గమనం):**

ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కుదించే జీవో నంబర్ 25 ను రద్దు చేయాలని టిఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కేసముద్రం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపెయిన్ లో పాల్గొని యాకూబ్ మాట్లాడారు...ప్రభుత్వ పాఠశాలలు సహజ మరణం పొందేలా ఉపాధ్యాయుల సర్దుబాటు చేసే జీవో నంబర్ 25 ను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే, ప్రజల విశ్వాసం పొందాలంటే తరగతికి ఒక టీచర్ను, ఒక ప్రధానోపాధ్యాయున్ని, బోధనేతర పనులకు సిబ్బందిని నియమించాలన్నారు. మోడల్ స్కూల్, కేజీబీవీ ఉపాధ్యాయులకు మరియు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగులందరికీ ఆరోగ్య కార్డులను ఇవ్వాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు చెల్లించాలని, కారుణ్య నియామకాలు చెప్పట్టాలని, పీఆర్సి ని ప్రకటించి జులై 2023 నుండి అమలుచేయాలని, పెండింగ్ లో ఉన్న డి ఏ లను ప్రకటించాలని, సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునఃరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, కళ్యాణ్, జిల్లా కార్యదర్శి ఉస్సేన్, మండల నాయకులు వీరస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- జబర్దస్త్ ఫేం రాజమౌళి సూచన

**కేసముద్రం, జులై 7(ప్రభాత గమనం):**

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో మంగళవారం జబర్దస్త్ ఫేమ్ రాజమౌళి విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయం ఎంతో విలువైనదని, విద్యార్థులు ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యాభ్యాసంలో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థి దశలోనే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు క్రమశిక్షణతో, పట్టుదలతో చదవాలని చెప్పారు. లక్ష్య సాధనకు కష్టపడే వారికి విజయం తప్పకుండా లభిస్తుందని పేర్కొన్నారు. విద్యతో పాటు మంచి నడవడి, సమయపాలన అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థుల్లో ఉత్సాహం నింపేందుకు పలు కామెడీ సన్నివేశాలను ప్రదర్శించి, పాటలు పాడుతూ వారిని అలరించారు. ఆయన మాటలు, వినోదాత్మక కార్యక్రమాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ పేదరికంలో పుట్టి ఎటువంటి వసతులు, సపోర్టు లేకుండానే ప్రపంచంలో ఉన్న తెలుగు వారందరికీ పరిచయమయ్యేలా ఎదిగిన జబర్దస్త్ రాజమౌళిని ప్రతి విద్యార్థి ఆదర్శంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బండ వెంకన్న, చంద శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# వయనాడ్‌లో భారీ వర్షాలు..

**హైదరాబాద్, జులై 7(ప్రభాత గమనం):**

కేరళలోని వయనాడ్ జిల్లాలో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. కొండచరియల శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు సమాచారం. ఘటనాస్థలంలో సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు, సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో రహదారులు దెబ్బతినగా, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో శిథిలాలను తొలగిస్తూ చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు సహాయక బృందాలు ప్రయత్నిస్తున్నాయి. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# గురుకుల పాఠశాలలో దారుణం..

- విద్యార్థినితో పెన్ క్యాప్ మింగించిన తోటి విద్యార్థినులు
- ఆపరేషన్ చేసి తొలగించిన వైద్యులు
- కాగజ్ నగర్ గురుకుల పాఠశాలలో ఘటన

**హైదరాబాద్ జులై 7(ప్రభాత గమనం):**

బీటెక్, డిగ్రీ కాలేజీల్లో కన్పించే ర్యాగింగ్ భూతం ఓ స్కూల్లో కలకలం రేపింది. ఆసిఫాబాద్ కాగజ్నగర్ గురుకుల పాఠశాలలో ఓ టెన్త్ విద్యార్థిని పట్ల తోటి విద్యార్థినులు దారుణంగా ప్రవర్తించారు. కళ్లకు గంతలు కట్టి హింసించడంతో పాటు గొంతులో పెన్ క్యాప్ వేసి బలవంతంగా నీళ్లు తాగించారు. కడుపులోకి వెళ్లిన క్యాప్ ను వైద్యులు శస్త్రచికిత్స చేసి తొలగించారు. బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.





# ఎరుకుల సంఘం కేసముద్రం మండల కమిటీ ఎన్నిక...

**కేసముద్రం, జులై 7(ప్రభాత గమనం):**

తెలంగాణ ప్రదేశ్ ఎరుకుల సంఘం రాష్ట్రఅధ్యక్షులు కూతడి కుమర్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు పేరం విరస్వామి ఆధ్వర్యంలో కేసముద్రం మండల కమిటీ ఎన్నుకోవడం జరిగింది. కేసముద్రం మండల అధ్యక్షులుగా కట్ల పాపయ్య, ఉపాధ్యాయులు కట్ల వెంకన్న, ప్రధాన కార్యదర్శి కోనేటి సంపత్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు గా రాష్ట్ర ఉపాధ్యక్షులు కేతిరి ఉప్పలయ్య పాల్గొని మాట్లాడారు..మహబూబాబాద్ జిల్లాలో ఏకలవ్య కూస్థులను ఏక తాథటి పై తీసుకోని వచ్చి అందరికి మన హక్కు లను తెలియచేస్తూ మన కులస్థులకు న్యాయం చేయాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సంఘం రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు రాయపురం సంపత్, జిల్లా ప్రధాన కార్యదర్శి పేరం బక్కయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కుంభం మహేష్,జిల్లా యూత్ ఉపాధ్యక్షులు గుతుప విజేందర్,ఇనుగుర్తి మండల అధ్యక్షులు మాదగని ఉప్పలయ్య, ఇనుగుర్తి మండల ప్రధాన కార్యదర్శి గుతుప యాకయ్య, కేసముద్రం విలెజ్ మాజీ సర్పంచ్ గుతుప రమేష్, మాదగాని వెంకన్న, కులసభ్యులు పాల్గొన్నారు.

# ఇళ్ల పైనుంచి ప్రమాదకర 11కేవీ వైర్లు

- గాలివానకు తెగిపడి తప్పిన పెను ప్రమాదం!
- పట్టించుకోని అధికారులు.. కేవీపీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం
- అధికారుల నిర్లక్ష్యంపై 'బేతోలు' ప్రజల ఆగ్రహం:
- విద్యుత్ ఎస్సీ కార్యాలయం ముందు భారీ ధర్నా
- మహబూబాబాద్ టౌన్ ఫీడర్ నుంచే విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్



**మహబూబాబాద్, జూలై 7 (ప్రభాత గమనం) :**

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తమైంది. గ్రామంలోని బీసీ కాలనీ ఇళ్లపై నుంచి వెళ్తున్న 11 కేవీ హైటెన్షన్ లైన్ల వల్ల ప్రాణాపాయం పొంచి ఉందంటూ కాలనీవాసులు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (KVPS) నాయకులతో కలిసి మంగళవారం విద్యుత్ శాఖ ఎస్సీ (SC) కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రమాదేవికి వినతిపత్రం సమర్పించారు.ఇటీవల కురిసిన వర్షాలకు బీసీ కాలనీలోని ఇళ్ల మధ్య 11 కేవీ విద్యుత్ వైరు తెగిపడటంతో ఒక్కసారిగా హైవోల్టేజ్ వచ్చి ఇళ్లలోని టీవీలు, ఫ్యాన్లు కాలిపోయాయి. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. హైటెన్షన్ లైన్ల కారణంగా పిల్లలు, వృద్ధులు నిత్యం భయాందోళనల మధ్య బతుకుతున్నారని, వర్షాకాలం ప్రారంభం కావడంతో ముప్పు మరింత పెరిగిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందిస్తారా? అని అధికారులను నిలదీశారు. "పలుమార్లు ఫిర్యాదులు చేసినా క్షేత్రస్థాయి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించడం సరికాదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇళ్లపై ఉన్న వైర్లను వెంటనే తొలగించాలి."గ్రామంలోని విద్యుత్ సమస్యలపై స్థానిక నాయకుడు షేక్ ఖాదర్ బాబా మాట్లాడుతూ.. ప్రస్తుతం బేతోలు గ్రామానికి మొగిలిచర్ల జెగ్య తండా ఫీడర్ నుండి విద్యుత్ సరఫరా జరుగుతోందని, దీనివల్ల పగలు, రాత్రి తేడా లేకుండా 2 నుండి 4 గంటల పాటు అప్రకటిత కరెంట్ కోతలు విధిస్తున్నారని మండిపడ్డారు. దీనివల్ల ఇటు ప్రజలు, అటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య తీరాలంటే బేతోలు 6వ వార్డుకు మహబూబాబాద్ టౌన్ ఫీడర్ నుండి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు మరియు కాలనీ వాసులు జినుక ఎల్లయ్య, షేక్ యాకుబ్, గడ్డం షేక్ జావిద్, గుండపల్లి వెంకటేష్, షేక్ ఇమ్రాన్, గడ్డం చెన్నయ్య, షేక్ సోషల్, ఎర్రం వరుణ్, షేక్ హిమాయితుల్లాతో పాటు మహిళలు దూదికట్ల దేవమ్మ, ఆదేపు ఉమా, సకినం రత్న, గుండపల్లి లచ్చమ్మ, షేక్ మీనా, గుండెపల్లి కవిత, షేక్ జానీబి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటమే
# ఎమ్మార్పీఎస్ లక్ష్యం

- మండల అధ్యక్షుడు కొమ్ము నాగరాజ్ మాదిగ
- కేసముద్రంలో ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కేసముద్రం, జూలై 7 (ప్రభాత గమనం):**

ప్రజా సమస్యల పరిష్కారం, బహుజనుల హక్కుల సాధనే ధ్యేయంగా ఏర్పడిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నిరంతరం ప్రజల పక్షాన నిలిచి పోరాడుతుందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ము నాగరాజ్ మాదిగ స్పష్టం చేశారు. మంగళవారం కేసముద్రం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఎగురవేసిన అనంతరం నాగరాజ్ మాదిగ విలేకరులతో మాట్లాడారు.గడిచిన 31 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ అలుపెరుగని ప్రజా ఉద్యమాలు చేస్తూ ఎందరో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, పేద ప్రజల గుండెల్లో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. నాడు గుండె జబ్బులతో బాధపడుతున్న పేద పిల్లల ప్రాణాలు కాపాడేందుకు, ఈ రాష్ట్రంలో 'ఆరోగ్యశ్రీ' లాంటి బృహత్తర పథకం రావడానికి ఎమ్మార్పీఎస్ చేసిన అహర్నిశల కృషిని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాగే, ఉమ్మడి రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డుదారుల హక్కుల కొరకు ప్రతి కలెక్టరేట్‌ను ముట్టడించి, పేదలకు 6 కేజీల బియ్యం సాధించిన ఘనత తమ సంఘానిదేనని నాగరాజ్ మాదిగ గర్వంగా ప్రకటించారు. నేడు వికలాంగులు రూ. 4,000, వృద్ధులు, వితంతువులు రూ. 2,000 చొప్పున పింఛన్లు అందుకుంటున్నారంటే అది ఎమ్మార్పీఎస్ చేసిన సుదీర్ఘ ఉద్యమాల ఫలితమేనని ఉద్ఘాటించారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల ప్రమోషన్ల కొరకు కూడా నిరంతరం పోరాడిన చరిత్ర ఎమ్మార్పీఎస్ కు ఉందన్నారు.భవిష్యత్తులో ప్రజల అవసరాల రీత్యా రాష్ట్రంలో ఎలాంటి ఉద్యమానికైనా ఎమ్మార్పీఎస్ ముందుండి నడుస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో వికలాంగుల పింఛన్‌ను రూ. 6,000కు, వృద్ధులు, వితంతువుల పింఛన్‌ను రూ. 4,000కు పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, అందుకోసం అవసరమైతే మరో విడత ఉద్యమాలకు సైతం వెనకాడబోమని హెచ్చరించారు.ఈ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు దండు శరత్, కేసముద్రం గ్రామ అధ్యక్షులు పందుల శ్రీను మాదిగ, ముఖ్య నాయకులు దర్శనం శ్రీను, లేదల్ల లక్ష్మయ్య, సోమారపు కౌసల్య, విహెచ్‌పిఎస్ నాయకులు బిక్ష నాయక్, జ్యోతి, లక్ష్మి, మహేష్ తదితర అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ఘనంగా ఎమ్మార్పీఎస్
# ఆవిర్భావ దినోత్సవం..

- వైభవంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు
- జెండా ఆవిష్కరించిన నాయకులు, కార్యకర్తల భారీ ర్యాలీ

**గార్ల, జూలై 7 (ప్రభాత గమనం) :**

మండల కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని, అలాగే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా గార్ల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ శ్రేణులు భారీ ర్యాలీ చేపట్టాయి. అనంతరం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ అనంతరం గార్ల వర్తక సంఘం భవనంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మార్పీఎస్ గార్ల మండల ఇంచార్జ్ ఇరుగు రవీందర్ మాదిగ మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ సాధించిన విజయాలను కొనియాడారు. 32 ఏళ్లుగా మాదిగల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక శక్తి ఎమ్మార్పీఎస్ అని, రాబోయే రోజుల్లో వ్యవస్థాపక అధ్యక్షుల ఆశయ సాధనకు, హక్కుల రక్షణకు ప్రతి ఒక్క కార్యకర్త పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.ఈ సంబరాల్లో, సమావేశంలో ఎమ్మార్పీఎస్ గార్ల మండల అధ్యక్షుడు, కొరివి మండల ఇంచార్జ్ దూడపంగు శ్రీనివాసరావు మాదిగ, మండల ఉపాధ్యక్షుడు భాష పంగు జయరాజ్ మాదిగ, సీనియర్ నాయకులు కొత్తపల్లి వెంకన్న మాదిగ, గిన్నారపు మురళితారక రామారావు, పుల్లూరు వెంకటేశ్వర్లు, జెల్ల శ్రీను మాదిగ, జిల్లా వెంకటేశ్వర్లు, చెరుకుపల్లి శ్రీను, ఇమ్మడి వెంకన్న, దూడపంగు వెంకన్న, పందుల కృష్ణ, సాయి, పిడమర్తి శ్యామ్ బాబు పాల్గొన్నారు. అలాగే ఎరుకల సంఘం గార్ల మండల బాధ్యులు ఎరుకల వెంకన్న, ఎమ్మార్పీఎస్ మహిళా అధ్యక్షురాలు గంగా, గాజుల రాజమ్మలతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పెనుగొండ కాంగ్రెస్‌లో పదవుల రగడ

- కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ముదిగిరి సురేష్ ఆవేదన

**కేసముద్రం, జులై 7(ప్రభాత గమనం):**



పెనుగొండ గ్రామ కాంగ్రెస్ పార్టీలో పదవుల కేటాయింపులో పారదర్శకత లోపించిందని, కష్టపడి పార్టీ కోసం పనిచేసిన సామాన్య కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పెనుగొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ముదిగిరి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామపార్టీ కమిటీ ఏర్పాటు, గతేడాది ఇందిరమ్మ ఇళ్ల కమిటీ నియామకాలు, ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఎంపిక వంటి కీలక నిర్ణయాలను పార్టీ నాయకులు కార్యకర్తలతో ఎలాంటి చర్చలు జరపకుండానే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించారు. అదేవిధంగా ప్రస్తుతం ధాన్య మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్ అయ్యే అవకాశాలను పెనుగొండ గ్రామానికి వస్తే ఈ పదవుల ఎంపికలో కూడా పార్టీ ముఖ్య కార్యకర్తలను సంప్రదించకుండా నిర్ణయాలు తీసుకోవడం బాధాకరమని అన్నారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేసిన కార్యకర్తలను పూర్తిగా విస్మరించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేసిన సామాన్య కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని, నామినేటెడ్ పదవుల్లో వారికి సముచిత ప్రాధాన్యత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో పార్టీకి సంబంధించిన ప్రతి నిర్ణయాన్ని పారదర్శకంగా, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తీసుకోవాలని జిల్లా పార్టీ నాయకత్వాన్ని కోరుతున్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలే వెన్నెముక అని, వారి మనోభావాలను గౌరవించినప్పుడే కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయిలో మరింత బలపడుతుందని సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు.

## హోర్మూజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్తత

- రెండు నౌకలపై ఇరాన్ మిస్సైల్ దాడి

టెహ్రాన్,ప్రభాత గమనం, జూలై 7: హోర్మూజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. హోర్మూజ్‌లో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ రెవల్యూషనరీ కార్ప్స్ గార్డ్స్ దాడులు చేసింది. రెండు నౌకలపై మిస్సైల్స్ ప్రయోగించింది. ఈ దాడుల్లో రెండు నౌకలు దెబ్బ తిన్నాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ విషయాన్ని అమెరికా అధికారులు డియాకు వెల్లడించారు. కాగా, మూడు వారాల క్రితం అమెరికా, ఇరాన్ దేశాలు మెమొరాండమ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్‌పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం హోర్మూజ్ జలసంధిలో దాడులు ఆపేస్తామని ఇరాన్ ప్రకటించింది. రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం జరిగిన తర్వాత కూడా ఇరాన్ దాడులకు పాల్పడటంపై అమెరికా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. మరో ఘటనలో.. ఒమన్‌లోని లిమా తీరంలో దక్షిణ దిశగా ప్రయాణిస్తున్న ఓ ఆయిల్ ట్యాంకర్‌ను పేలుడు వస్తువు బలంగా ఢీకొట్టింది. దీని కారణంగా ఆ నౌక ఎడమ వైపు భాగంలో భారీగా మంటలు చెలరేగాయి. బ్రిటీష్ మిలిటరీకి చెందిన 'యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్' ఈ ప్రమాదాన్ని అధికారికంగా ధ్రువీకరిస్తూ ప్రకటన విడుదల చేసింది.

## 'ఇందిరమ్మ ఇల్లు' నిర్మాణానికి
# విద్యుత్ తీగలు ఆటంకం!

- మొరపెట్టుకున్నా పట్టించుకోని విద్యుత్ శాఖ సిబ్బంది
- స్లాబ్ లెవల్ లో ఆగిపోయిన పేద కుటుంబాల ఇంటి కల
- బయ్యారం మండలం బాలాజీ పేట ప్రకాష్ నగర్ తండాలో దారుణం

**బయ్యారం, జూలై 7 (ప్రభాత గమనం) :**

సొంతింటి కలను నిజం చేసుకోవాలనే ఆ పేద కుటుంబాల ఆశలకు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం శాపంగా మారింది. తమకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకుందామని ముందడుగు వేస్తే.. ఇంటి స్థలంపై నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్ యమపాశంలా మారింది. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోవడంతో, ఇళ్ల నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయి లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బయ్యారం మండలం బాలాజీ పేట ప్రకాష్ నగర్ తండాకు చెందిన గూగులోత్ పద్మ – రామరావు దంపతులకు ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఎంతో సంబరంగా ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించిన ఆ కుటుంబానికి విద్యుత్ వైర్లు పెద్ద సమస్యగా మారాయి. వారి ఇంటి స్థలానికి సరిగ్గా అడ్డంగా విద్యుత్ లైన్ వెళ్తుండటంతో.. ప్రాణభయంతో ఇల్లు కట్టలేని పరిస్థితి నెలకొంది. ఎలాగోలా కష్టపడి స్లాబ్ లెవల్ వరకు గోడలు లేపినప్పటికీ, తలపైన ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్ల కారణంగా ప్రస్తుతం స్లాబ్ వేయడానికి వీల్లేకుండా నిర్మాణం పూర్తిగా నిలిచిపోయింది.ఇంటి స్థలంపై నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్‌ను పక్కకు తొలగించాలని బాధితులు ఇందిరమ్మ ఇల్లు మంజూరైనప్పటి నుంచి విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. స్థానిక లైన్‌మెన్‌కు సమస్యను స్వయంగా వివరించి, ప్రాణాలకు ముప్పు ఉందని మొరపెట్టుకున్నా కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు."చాలాసార్లు అధికారులకు చెప్పాం. లైన్‌మెన్‌కు బతిమిలాడాం. అయినా ఎవరూ స్పందించడం లేదు. పేదవాళ్లం ఎంతో కష్టపడి స్లాబ్ లెవల్ వరకు తెచ్చాం, ఇప్పుడు కరెంట్ వైర్ల వల్ల పని ఆగిపోయింది. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయంగా ఉంది. అధికారులకు ఇంత నిర్లక్ష్యమా?"ప్రమాదం పొంచి ఉందని బాధితులు నెత్తీనోరూ బాదుకుంటున్నా



విద్యుత్ శాఖ అధికారులు ఇంత ఉదాసీనంగా వ్యవహరించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవిస్తే బాధ్యత ఎవరిది? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఆ విద్యుత్ లైన్‌ను అక్కడి నుంచి తొలగించి, పేద కుటుంబం ఇల్లు పూర్తి చేసుకునేలా చర్యలు చేపట్టాలని తండావాసులు డిమాండ్ చేస్తున్నారు.

## రైతులు ఐకమత్యంగా ఉండి
# సమస్యలు పరిష్కరించుకోవాలి



**కేసముద్రం జులై 7(ప్రభాత గమనం):**

రైతులు ఐకమత్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి సూచించారు.

### మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి

నర్సింహులపేట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన అన్నదాత పొదుపు మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గంట సంజీవరెడ్డి మాట్లాడుతూ రైతులు సహకార సంఘంగా ఏర్పడడం ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు, రాయితీలను సులభంగా పొందవచ్చని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి దిగుబడులు పెంచుకోవాలని, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల సాగు చేపడితే మంచి ధరలు లభించే అవకాశాలు ఉంటాయని చెప్పారు. నాణ్యమైన విత్తనాలు, సమతుల్య ఎరువుల వినియోగంతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని సూచించారు. సహకార సంఘాల ద్వారా కొనుగోలు, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాల్లో రైతులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు పరస్పరం సహకరించుకుని నష్టాలను తగ్గించుకోవాలని కోరారు. రైతుల ఆర్థికాభివృద్ధే సహకార సంఘాల ప్రధాన లక్ష్యమని, రైతుల ఐక్యతే వ్యవసాయాభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని, ప్రతి రైతు సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**- నూతన కమిటీ ఎన్నిక....**

సమావేశ అనంతరం ఈ సంఘం నూతన కమిటీని మండల వ్యవసాయ అధికారి బి.వెంకన్న పర్యవేక్షణలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షునిగా ఆకుల సుధాకర్, ఉపాధ్యక్షుడిగా సామల రమేష్, ప్రధాన కార్యదర్శిగా పాల శ్రీనివాస్, కోశాధికారిగా చింతనూరి రమేష్, సహాయ కార్యదర్శిగా కూన శ్రీను, గౌరవ అధ్యక్షునిగా పెరటి వెంకట్రాంనర్సయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374